క్లుప్తంగా

రేపు 'స్వర ప్రభంజనం'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సోగ్గాడు శ్రీశోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ శ్రీవేంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో 'స్వర ప్రభంజనం' నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు. గతంలో 50 పాటలు పాడి అర్ధశత గాన ప్రభ, 75 సినీ గీతాలు పాడి వజ్రామృత గాన ప్రభ బిరుదు పొందిన వర్ధమాన గాయని కోరుకొండ ప్రభచే 116 పాటలతో సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు. అలాగే గాయనీ గాయకులు షేక్ మదరషా అలీ, మల్లాది రాజేశ్వరరావు, బీహెచ్ రామకృష్ణ, బోడపాటి శ్రీనివాస్, కొలుసు వెంకటేశ్వరరావు, ఎస్ఎంఆర్ కిశోర్, చిర్ల నవీన్, కృష్ణవేణి, భారతి, సూర్యకుమారి, లక్ష్మి, శ్రీదేవి పాల్గొంటారని వివరించారు. సంగీత ప్రియులు హాజరుకావాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



బొమ్మూరులో మొక్కలు నాటుతున్న సామాజికవేత్త పుత్ర హనోక్

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సామాజిక వేత్త పుత్ర హనోక్ పిలుపునిచ్చారు. జేఎస్ఎస్ డబ్ల్యూ మినిస్ట్రీస్, మనం ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బొమ్మూరు క్రైస్తవుల సమాధుల తోటలో మొక్కలు నాటి, వాటికి గార్డ్స్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సామాజిక వేత్త పుత్ర హనోక్ చేతుల మీదుగా మొక్కలు నాటించారు. కార్యక్రమంలో మనం ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు ఇజ్జిన వినోద్‌కుమార్, అధ్యక్షురాలు ఇజ్జిన నవీనకుమారి, కేఎస్ స్వామి, విజయ్‌కుమార్, పి.జాకబ్ సుందర్, పి.మధుబాబు, బిషప్స్ పొన్నామాటి బాబ్జి, డి.ఆనందరావు, సామాజిక వేత్త అద్దంకి రాజాయోనా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

కడియం: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి మండలంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.పోసిబాబు తెలిపారు. రెవెన్యూ గ్రామాల వారీగా ఈ గ్రామసభలు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతాయన్నారు. 21, 22వ తేదీల్లో మురమండ పంచాయతీ వద్ద, 23, 24వ తేదీల్లో వీరవరం, 25, 26వ తేదీల్లో వేమగిరి, 28, 29వ తేదీల్లో జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, వచ్చే నెల 4, 5, 6వ తేదీల్లో కడియం, కడియపులంక, కడియపుసావరం గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉంటే ఆ సభల వద్ద తెలియజేసి, పరిష్కారం పొందవచ్చని పోసిబాబు వివరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కడియంలో గంబూషియా చేపలు విడుదల చేస్తున్న ఉప సర్పంచ్ నాని

కడియం: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీబీ రామకృష్ణ కోరారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా నిల్వ నీటిలో గంబూషియా చేపలను శుక్రవారం విడుదల చేశారు. కడియంలోని భాస్కరరామ్ నగర్, శ్రీనగర్ కాలనీల మధ్య ఉన్న మురుగు కాలువలో చేపలను విడిచిపెట్టారు. కడియం ఫిష్‌ఫామ్ వారు అందించిన ఈ చేపలు దోమల లార్వాను తినేస్తాయన్నారు. తద్వారా దోమల సంతతిని అరికట్టవచ్చన్నారు. ఉప సర్పంచ్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మొద్దునిద్ర వారిదీ.. వీరిదీ

- తూర్పు రైల్వే స్టేషన్ పర్యవేక్షణ గాలికి
- ఆ ఆవరణలో నిద్రిస్తున్న మందుబాబులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



రాజమహేంద్రవరంలోని తూర్పు రైల్వే స్టేషన్ ముఖద్వారం

రాజమహేంద్రవరంసిటీ: అడిగేవారు లేరు.. పట్టించుకునే వారు కానరారు.. ఇదే కొందరికి ఇష్టారాజ్యం అయ్యింది. తప్పుదారి తిరిగేవారికి కేంద్రంలా మారింది. ఇదెక్కడో కాదు.. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ తూర్పు వైపున పరిస్థితి ఇది. ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు వేదికైంది. డివిజన్‌లో విజయవాడ తర్వాత పెద్ద రైల్వే స్టేషన్‌గా నగర రైల్వే స్టేషన్‌కు పేరుంది. ఈ రైల్వే స్టేషన్‌లో ఐదు ప్లాట్‌ఫామ్స్ ఉన్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ స్టేషన్‌లో 4, 5 ప్లాట్‌ఫామ్‌లకు వచ్చే రైళ్ల నుంచి దిగే ప్రయాణికులు తూర్పు రైల్వేస్టేషన్ వైపు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా వెస్ట్ రైల్వే స్టేషన్ కేంద్రంగా రాకపోకలు సాగుతుండగా, తూర్పు ప్రాంతంలో ప్రయాణికుల కోసం తూర్పు రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇటుగా బొమ్మూరు, మోరంపూడి, తాడితోట ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే రైల్వే, ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు పర్యవేక్షణ లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూర్పు రైల్వే స్టేషన్ కేంద్రంగా టిక్కెట్ కౌంటర్లలో అమ్మకాలు సాగుతుండగా, అక్కడే బిక్షాటన చేసేవారు, మందుబాబులు తిష్ట వేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. స్టేషన్ ఆవరణలో కొందరు తుప్పట్లు పరుచుకుని



ఫుట్‌వే బ్రిడ్జికి ఇరువైపులా పెరిగిన తుప్పలు

నిద్రిస్తుండటంతో టిక్కెట్ కొనుగోలు చేసేందుకు, రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రక్షణ దళం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రాత్రి సమయాల్లో తూర్పు రైల్వే స్టేషన్ వైపు వెళ్లాలంటేనే ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ స్టేషన్ ఆవరణలో



తూర్పు రైల్వే స్టేషన్ ఆవరణలో నిద్రిస్తున్న యాచకులు

మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో విష పురుగులు తిరుగుతున్నాయి. తుప్పలను తొలగించే ప్రయత్నం రైల్వే శాఖ అధికారులు చేయకపోవడం శోచనీయం. ఫుట్ వే బ్రిడ్జి నుంచి కిందకు దిగే నడకదారిలో సైతం మొక్కలు విపరీతంగా పెరిగాయి. ఏ సమయంలో ఏ విష కీటకాలు కాటేస్తాయోనని భయపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలీసుల తనిఖీ లేక..



ఈ రైల్వే స్టేషన్ పరిసరాల్లో రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇక్కడ పోలీసుల తనిఖీలు లేక పరిస్థితి చేయిదాటుతోంది. స్టేషన్‌కు సమీపంలోని తుప్పల్లో గంజాయి తాగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. స్టేషన్ అధికారులు, ఆర్పీఎఫ్, జీఆర్పీ దళాలు కనీసం కన్నెత్తి చూడకపోవడం దారుణం. ఎప్పటికైనా సమస్యలపై దృష్టిసారించాలి.

– వలవల దుర్గాప్రసాద్, స్థానికుడు

యాచకులతో ఇబ్బంది



తూర్పు రైల్వే స్టేషన్ ఆవరణలో యాచకులు, మందుబాబులు ఎక్కువగా కనిపిస్తున్నారు. టిక్కెట్ కొనుగోలు చేసేందుకు వెళ్లాలంటే కౌంటర్ సమీపంలో పదుల సంఖ్యలో ఉంటున్నారు. వీరివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైల్వే శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, స్టేషన్ ఆవరణలో పెరిగిన తుప్పలు తొలగించే చర్యలు చేపట్టాలి .

– బొదిరెడ్డి అప్పారావురెడ్డి, స్థానికుడు

ఫ్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక



అజయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఆదికవి నన్నయ యూనివర్సిటీ కండక్ట్ చేసిన ఫ్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఫైనల్ ఇయర్ జేఎంసీపీపీఎస్‌వై చదువుతున్న ఎస్.అజయ్ నాయుడు ఎంపికయ్యాడు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అభినందించారు. తొలిసారిగా ఎన్ఎస్ఎస్ తరఫున ఆర్డీలో పార్టిసిపేట్ చేస్తున్నందుకు ఎన్ఎస్ పీఓ డాక్టర్ బి.మల్లికార్జున, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ భవాని, కె.సుభాషిణి అభినందించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రకాశంనగర్: మల్టీ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్ సీనియర్ డీజీఎం కుప్పా సతీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ స్థానిక జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న కాస్మోపాలిటన్ క్లబ్ వద్ద ఈ శిబిరం జరుగుతుందన్నారు. గుండె, లివర్ సంబంధిత, క్యాన్సర్, ఆర్థోపెడిక్స్, కిడ్నీ విభాగాల్లో ఈసీజీ, 2డీ ఎకో, బ్రెస్ట్ స్క్రీనింగ్, బీఎండీ తదితర వైద్య పరీక్షలు, సేవలు అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 63034 19678 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'పలుకు' సంస్థకు చేయూత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక స్వరాజ్యనగర్‌లోని పలుకు ఆశ్రమ పాఠశాలకు బుర్రిలంక గ్రామానికి చెందిన నర్సరీ రైతు, టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత తాడాల విష్ణుచక్రవర్తి రూ.51,116 విరాళంగా అందించారు. శుక్రవారం పలుకు సంస్థలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు గంటా కనకదుర్గకు తాడాల విష్ణుచక్రవర్తి, రాజరాజేశ్వరి దంపతులు ఆ నగదును ఇచ్చారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ తన భార్యతో కలసి పలుకు సంస్థను సందర్శించారని, ఈ సంస్థలో విద్యనభ్యసిస్తున్న చెవిటి, మూగ పిల్లలను చూసి చలించిపోయామన్నారు. దీంతో పలుకు సంస్థకు తమ వంతు సాయంగా రూ.51,116 ఇచ్చామని అన్నారు. భవిష్యత్తులో తమ సంస్థ ద్వారా సహాయ సహకారాలు



పలుకు నిర్వాహకురాలు గంగా కనకదుర్గకు నగదు అందజేస్తున్న విష్ణు చక్రవర్తి దంపతులు

అందిస్తామని చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో పలుకు సత్యనారాయణ, తాడాల చక్రవర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి

ప్రకాశంనగర్: ఇసుకను అందుబాటులోకి తెచ్చి నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక శ్యామల సెంటర్‌లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. దీనికి ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ తీసుకువచ్చి ఉచిత ఇసుక అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా నేటికీ ఉచిత ఇసుక వినియోగదారులకు అందుబాటులోకి రాలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం హామీని నిలబెట్టుకుని, ఇసుక లభ్యం అయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు జె.రాంబాబు, బి.పవన్, మూర్తి, తులసి, రాణి, రాజా తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు సమాజానికి అవసరం

కడియం: పోలీసుల సేవలు సమాజానికి ఎంతో అవసరమని పీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కమ్యూనిటీ పారామెడిక్స్- ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కడియం పోలీస్ స్టేషన్‌లోని సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ విశ్రాంత వైద్యాధికారి ఎంవీఆర్ మూర్తి వైద్య పరీక్షలు చేశారు. రక్త, ఈసీజీ, బీపీ తదితర వైద్య పరీక్షలు చేశారు. పని ఒత్తిడితో వచ్చే రుగ్మతలు, అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.



కడియంలో వైద్య పరీక్షలు చేస్తున్న మూర్తి, చిత్రంలో పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్‌బాబు, సీహెచ్ఎస్‌బీ కామరాజు, పి.సత్యనారాయణ, ఆర్‌వీ డయాగ్నోస్టిక్స్ రాము, భవానీ డయోగ్నోస్టిక్ ల్యాబ్ శ్రీకర్ సహాయ సహకారాలు అందజేశారు.

వైఎస్ నరసింహారావు ఆశయాలను కొనసాగించాలి



కృష్ణకుమార్‌ను సత్కరిస్తున్న ఆంధ్ర కేసరి యువజన సమితి సభ్యులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం అభివృద్ధిని కాంక్షించిన వైఎస్ నరసింహారావు ఆశయాలను కొనసాగించాలని ఆంధ్ర కేసరి యువజన సమితి సభ్యులు కొనియాడారు. శుక్రవారం నరసింహారావు 88వ జయంతి సందర్భంగా ఆయన నెలకొల్పిన స్థానిక ఆంధ్రకేసరి డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన నిర్మించిన స్వాతంత్ర్య సమర యోధుల పార్కులో విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం నరసింహారావు స్మారక పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయుడు బీవీ కృష్ణకుమార్‌కు అందజేశారు. సమితి పూర్వ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి, సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు, ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్, కోశాధికారి సునీల్ గౌతం, డిగ్రీ కళాశాల చైర్మన్ అసదుల్లా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయదేవత చేతిలో రాజ్యాంగం చారిత్రక నిర్ణయం

కంబాలచెరువు: న్యాయ దేవత చేతిలో భారత రాజ్యాంగం ఉంచడంతో పాటు, కళ్లకు ఉన్న కళ్ల గంతలను విప్పడం చారిత్రక నిర్ణయమని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు అన్నారు. ఈ నిర్ణయాన్ని తీసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.చంద్రచూడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు సమీపంలో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో న్యాయ దేవత విగ్రహానికి కళ్ల గంతలు విపడంతో పాటు, చేతిలో భారత రాజ్యాంగాన్ని ఉంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ అందరికీ సమన్యాయం కలిగించాలన్న సదుద్దేశంతో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.చంద్రచూడ్ సాహసోపేత నిర్ణయాన్ని తీసు



జిల్లా కోర్టు సముదాయం వద్ద సంఘీభావం తెలియజేస్తున్న న్యాయవాదులు

కున్నారన్నారు. దీనిపై ప్రపంచ దేశాలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టిముక్కల అనంతరావు, కాశీ శ్రీనివాసరావు, రాష్ట్ర సహ కార్యదర్శి బీర అరుణ్‌కుమార్, సొసైటీ నాయకులు, న్యాయవాదులు కరుణాకర్ రాజు, పీఎల్ నాగేశ్వరరావు, కుంచే రాంబాబు, కూనరెడ్డి హేమంత్ శ్రీనివాస్, నజీర్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీ ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం డివిజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐఏఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక పురోభివృద్ధికి ఎల్ఐసీ ఎంత ముఖ్యమో, ఎల్ఐసీ పురోభివృద్ధికి ఏజెంట్లు అంతే ముఖ్యమన్న విషయాన్ని యాజమాన్యం, పాలకులు మరిచిపోయారన్నారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని, పాలసీదారులపై వేస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని, ఏజెంట్లకు తగ్గించిన కమీషన్‌ను పెంచాలని, పాలసీలు పాత పద్ధతిలోనే అమలు చేయాలని, రూ.లక్ష పాలసీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఏజెంట్లకు న్యాయం జరిగే వరకూ నిరసన కొనసాగిస్తామని సాయిబాబా తెలిపారు. యూనియన్ నాయకులతో పాటు, వివిధ ప్రాంతాల ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో నాలుగో స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు లక్షకుపైగా చేసి రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో రోడ్ల మరమ్మతులకు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర సహకారం పూర్తి స్థాయిలో ఉందన్నారు. పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని అన్నారు. అలాగే రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ ఆధునీకరణ జరుగుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సిద్దార్థనాథ్ సింగ్, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ జేఎస్ లక్ష్మీరమ్య అన్నారు. శుక్రవారం హుకుంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార వేదిక గ్రామసభ ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీరమ్య మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. రైతులకు ఎటువంటి భూ సమస్యలు రాకుండా గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు చూసుకోవాలని సూచించారు. మొత్తం 17 అర్జీలు వచ్చాయని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, మండల సర్వేయర్ సీహెచ్.భువనేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంకం ప్రసాద్, రైతులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మీరమ్య

కనకదుర్గమ్మ సన్నిధిలో అన్నదానం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని వెంకటగిరి వివేకానంద వీధిలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయం వద్ద శుక్రవారం సుమారు 5 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహానివేదన చేసిన అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. వివేకానంద యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామ మాజీ ఉప సర్పంచ్, హుకుంపేట సొసైటీ మాజీ చైర్‌పర్సన్‌ బొప్పన సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు.



కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాదం వడ్డిస్తున్న సుబ్బారావు తదితరులు

దాతల సహకారంతో భారీ ఎత్తున అన్నదానం చేపట్టామన్నారు. కార్యక్రమంలో దాసరి శివ, బొప్పన రామకృష్ణ, రామోజీ గౌరి, కణితి లక్ష్మీనారాయణ బ్రదర్స్, బొప్పన సతీష్ చౌదరి, రిమ్మలపూడి సుబ్బరాజు, బొడ్డు ఆంజనేయులు, బొడ్డు శ్రీను, బొప్పన సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్రస్ లేని సూపర్ సిక్స్ పథకాలు

రాజానగరం: అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీలను విస్మరించిందని మండల వైఎస్సార్ సీపీ నాయకులు నిలదీశారు. సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే.. కొత్తగా బీరును మార్కెట్‌లోకి తీసుకు వచ్చారన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ దూలం పెద్ద అధ్యక్షతన శుక్రవారం మీడియా సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్‌లు కుందేటి ప్రసాద్, కోలపాటి వెంకన్న, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అడబాల చినబాబు, నాళం రోశయ్య, దుర్గారావు తదితరులు తమదైన బాణీలో కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న తప్పులను ఎండగట్టారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామాల్లో ప్రజల సొమ్ముతో పాలకులు 'పల్లె పండుగ'లు చేసుకున్నారన్నారు. గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌ని ఆహ్వానించకుండానే అభివృద్ధి పనులకు కూటమి నాయకులు



రాజానగరం పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొబ్బరికాయలు కొట్టడం విచారకరమన్నారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తి ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే దోపిడీకి తెరలేపారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రజల కోసం ముందు జాగ్రత్త చర్యగా వేసిన ఇసుక గుట్టలను గుట్టుచప్పుడు లేకుండా తరలించారని ఆరోపించారు. ఇదే పరిస్థితి రాష్ట్రమంతటా అమలు చేస్తుండటంతో జనమంతా విస్తుపోతున్నారన్నారు. దోచుకోవడం, దాచుకోవడమే అజెండాగా ఉన్న కూటమి పాలకులు ప్రజా సంక్షేమాన్ని కూడా విస్మరించారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో 32 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తే, ఈ కూటమి ప్రభుత్వంలో ఆయా స్థలాల్లో ఇల్లు కట్టుకునే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేకపోతుందన్నారు. ఇక నియోజకవర్గంలో పరిస్థితులు మరీ అధ్వానంగా ఉన్నాయన్నారు. ఇంటింటికీ గోదావరి జలాలను అందించాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గత ప్రభుత్వంలో రూ. 215 కోట్లతో చేపట్టిన పనులను, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన రైతులకు ముంపు బెడదను శాశ్వతంగా నివారించేలా చేపట్టిన రివర్స్ పంపింగ్ పనులను ప్రస్తుత ఎమ్మెల్యే గాలికొదిలేశారన్నారు. దీంతో గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు వీటి గురించి ఎక్కడ నిలదీస్తారో అనే భయంతో తప్పించుకుని తిరుగుతున్నారని అన్నారు. ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ల సమయంలో మూడు పార్టీల నాయకులు మూడు సార్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఫొటోలు దిగుతున్నారని, అది వారి మధ్య ఉన్న ఐకమత్యమని ఎద్దేవా చేశారు.

సీసీ కెమెరాల చోరీపై ఫిర్యాదు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామానికి చెందిన శ్రీవసుధా ఎవెన్యూస్ లేఅవుట్‌కు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దొంగలించారని, లేఅవుట్‌లోని రోడ్డు ధ్వంసం చేయడానికి ప్రయత్నించారనే ఫిర్యాదుపై బిక్కవోలు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు. కొమరిపాలేనికి చెందిన పడాల వెంకటరామారెడ్డి, నేకూరి సత్యనారాయణ, ఆడబాల వీరబాబు, ఎ.సూరిబాబు, సున్నా సూరిబాబు, శ్రీనులు ఈ పని చేశారని కొమరిపాలెం గ్రామానికి చెందిన లేఅవుట్ భాగస్వామి కొవ్వూరి వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ ట్రాన్స్‌కో బొమ్మూరు 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ బొమ్మూరు నుంచి కొండగుంటూరు వరకూ ఫ్లాంథెర్ కండక్టర్ మార్పు క్రమంలో శనివారం, ఆదివారాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుంది. ఆయా రోజుల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ కాటన్ -బొమ్మూరు ఫీడర్ పరిధిలోని పాత బొమ్మూరు, మురళీకొండ, జీపీఆర్ రోడ్, ఏఎంజీ కాలేజీ వెనుక ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.